


నారాయణఖేడ్‌లో..

# మబ్బు ముసుగేసింది..

దీపావళితోనే చలికాలం వచ్చేసింది. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్, కోహీర్ మండలాల్లో మంగళవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. ఎనిమిది గంటలైనా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించలేదు. భారీ వాహనదారులు లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాయి.

-నారాయణఖేడ్/కోహీర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)



కోహీర్‌లో..



# దీపావళి వేడుకల్లో జగ్గారెడ్డి దంపతులు

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని రాంనగర్‌లో ఉన్న తన నివాసంలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. జగ్గారెడ్డితో పాటు ఆయన సతీమణి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కూతురు జయారెడ్డి, కుమారుడు భరత్‌సాయిరెడ్డి టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. అంతకుముందు తమ నివాసంలో లక్ష్మీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు.





లక్ష్మీపూజలో భాగంగా హారతి ఇస్తున్న జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి



దీపావళి వేడుకల్లో టపాసులు కాలుస్తున్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు

# మరువబోము మీ త్యాగం..

- శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకం
- వారి ధైర్య సాహసాలకు ప్రజలు అండగా ఉండాలి
- అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయమని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)ను మంగళవారం సంగారెడ్డిలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ పోలీసు అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసులను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని అన్నారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ఇప్పటివరకు 191 మంది పోలీసులు అమరులు కాగా, సంగారెడ్డి జిల్లాలో ఐదుగురు అమరులైనట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలు నిర్భయంగా జీవించగలిగే ధైర్యాన్ని ఇవ్వడంతో పోలీసుల పాత్ర కీలకన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా పోలీసుశాఖ ఎదురు నిలబడి పోరాడుతుందన్నారు. జిల్లాలో నాలుగు నెలల క్రితం జరిగిన సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో సహాయక చర్యల నిర్వహణలో సంగారెడ్డి జిల్లా పోలీసులు ధైర్యసహసాలను చాటారన్నారు. సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల ధైర్యసాహసాలు, దేశభక్తి భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. పోలీసు అమరుల ప్రాణత్యాగాల స్మరణలో భాగంగా నేటి నుంచి జాతీయ ఐక్యత దినోత్సవం (సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి) అక్టోబర్ 31 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అమరులైన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, శ్రీనివాసరావు, డీఎస్పీలు సత్యయ్యగౌడ్, సైదానాయక్, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, నరేందర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కళ్యాణి, యస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, డీసీఆర్బీ సీఐ రమేష్, ఆర్‌ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, డానియెల్ తదితరులు పాల్గొన్నారు.





పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సంగారెడ్డి కలెక్టర్, ఎస్పీ





# చిరస్మరణీయం

త్యాగధనుల కుటుంబాలకు ప్రజలు అండగా ఉండాలి

పోలీసుల వల్లనే శాంతి, భద్రత

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ డేకు ఆయన హాజరయ్యారు. అదనపు ఎస్పీ మహేందర్‌తో కలిసి అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు ఎన్నో త్యాగాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలకు వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. జిల్లాలో 14 మంది పోలీసులు విధి నిర్వహణలో వీరమరణం పొందారని గుర్తుచేసుకున్నారు. అమరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం అండగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం అమరులైన పోలీసు కుటుంబాలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సైబర్‌క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, .జిల్లా సీఐ, ఎస్‌ఐలు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమరుల కుటుంబాలకు జ్ఞాపిక అందజేస్తున్న మెదక్ కలెక్టర్

## పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పేల్చివేత అమరులకు నివాళి

పాపన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో నక్సలైట్ల దుశ్చర్యలో వీరమరణం పొందిన ఐదుగురు పోలీసులకు నివాళులర్పించారు. 1999 సెప్టెంబర్ 13న అర్ధరాత్రి పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై నక్సలైట్లు దాడిచేసి పేల్చివేసిన ఘటనలో ఐదుగురు పోలీసులు అమరులయ్యారు. ఈ ఘటనలో అసువులు బాసిన హెడ్‌కానిస్టేబుల్ రఘునందన్, కానిస్టేబుళ్లు నర్సింహులు, అబేద్ హుస్సేన్, రామ్ చందర్, ప్రసాద్‌ల త్యాగానికి గుర్తుగా స్టేషన్ పరిధిలో స్థూపం నిర్మించారు. అమరవీరు సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రతీ ఏడాది పోలీసులు సిబ్బంది ఈ స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. మంగళవారం ఎస్సై ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు.

## కార్తీకం.. పరమ పవిత్రం

- శివకేశవులకు ప్రీతికరమైన మాసం
- నేటి నుంచి ప్రారంభం
- వ్రతాలు, నోములకు విశిష్టత
- ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

7

## సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి : కలెక్టర్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యానికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుంచి సలహాలు, సూచనలు చేపట్టేందుకు ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వేను చేపట్టిందని పేర్కొన్నారు. ఈ నెల 25 లోపు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ వెబ్‌సైట్‌ను సందర్శించి తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాలని కలెక్టర్ కోరారు.



సంగారెడ్డిలో దీపావళి వేడుకల్లో యువతి

# దీపాల కాంతులు
# వెలుగు దివ్వెలు..

ఊరూవాడ ఉత్సాహంగా సంబరాలు

కళకళలాడిన గృహాలు, వ్యాపార సముదాయాలు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజలు..

మార్మోగిన టపాసుల చప్పుళ్లు



మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం/సంగారెడ్డి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో సోమవారం దీపావళి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఇళ్లు, దుకాణ సముదాయాలు దీపాల వెలుగులో కాంతులీనాయి. ప్రత్యేక అలంకరణలు, లైట్ల వెలుతురులో దగదగలాడాయి. చిన్నాపెద్ద ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. లక్ష్మీపూజలు నిర్వహించి, పటాకులు కాల్చి ఉత్సాహంగా గడిపారు. ఆకాశంలో రంగుల హరివిల్లులు విరిశాయి. చిచ్చుబుడ్లు, కాకరపూవ్వొత్తులు, బాంబుల మోత మోగింది. వ్యాపారులు కొత్త ఖాతా పుస్తకాలు ప్రారంభించారు. మెదక్‌లో లక్ష్మీపూజల్లో మున్సిపల్ మాజీ చైర్మన్లు చంద్రపాల్, బట్టి జగపతి, మల్లిఖార్జున్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

### భారీగా ఖర్చు

దీపావళి పండగకు ప్రజలు భారీగా ఖర్చు చేశారు. టపాసుల ధరలు తారాజువ్వల మాదిరిగా ఆకాశన్నంటినా వెనుకడుగు వెయకుండా కొనుగోలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 420 టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయగా, అనధికారికంగా ఈ సంఖ్య రెండుమూడు రెట్లు ఉండే అవకాశం ఉంది. ఆయా దుకాణాల్లో రూ. కోట్ల విలువైన టపాసుల విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. స్వీట్లు, పూల కోసమూ పెద్దమొత్తంలో ఖర్చు చేశారు.



సంగారెడ్డిలో...

## ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాలకు దరఖాస్తులు

మెదక్ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైద్య విధాన పరిషత్ పరిధిలో మెదక్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (జీడీ ఎంవోస్) ఉద్యోగాలకు ఒప్పంద ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శివదయాల్ పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఈ నెల 28న ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు మెదక్ కలెక్టరేట్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు ఖాళీలు 11, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (జీడీఎంఓఎస్) పోస్టు ఒకటి ఉన్నాయని వెల్లడించారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ వేతనం నెలకు రూ. లక్ష, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (జీడీఎంఓఎస్) వేతనం రూ. 52,351 ఉంటుందని పేర్కొన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగానికి ఏదైనా స్పెషలైజేషన్ ఎండీ/ఎం.ఎస్, డీఎన్‌బీ అదనంగా ఎంబీబీ తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని తెలిపారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ (జీడీఎంఓఎస్) పోస్టుకు ఎంబీబీఎస్ మరియు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని పేర్కొన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు గత ఆగస్టు ఒకటో తేదీ నాటికి 45 సంవత్సరాల లోపు ఉండాలని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ అకాడమిక్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. ఎంపికైన వారికి మెదక్ జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ ఆధ్వర్యంలో పనిచేయవలసి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9394514999 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# ఉపాధ్యాయుల సస్పెన్షన్‌పై సమగ్ర విచారణ

## నర్సాపూర్ పాఠశాలను సందర్శించిన ఆర్‌జేడీ, డీఈవో

నర్సాపూర్/కౌడిపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలో ఇటీవల పాఠశాలల్లో ఉపాధ్యాయుల తీరుపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విధులను నిర్లక్ష్యం చేశారనే కారణంతో ఇటీవల నర్సాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈవో రాధకిషన్ పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. పాఠశాల హెచ్‌ఎం రాచప్పతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మణ్, అశోక్ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని, పాఠశాల నిర్వహణ కోసం వచ్చిన నిధులను దుర్వినియోగం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో తూప్రాన్ ఎంఈవో సత్యనారాయణ విచారణ చేపట్టగా, ఆయన నివేదిక ఆధారంగా ముగ్గురిని వారం క్రితం సస్పెండ్ చేశారు. ఈ విషయంపై ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈవో రాధకిషన్ పాఠశాలలో మరోసారి విచారణ చేపట్టారు. నిధుల వినియోగంపై రికార్డులను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. అనంతరం కౌడిపల్లి మండలం కన్నారం పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌గౌడ్ తమకొద్దని ఈ నెల 17న విద్యార్థులు ధర్నా చేసిన సంఘటనపైనా వారు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



పాఠశాలలో విచారణ జరుపుతున్న ఆర్జేడీ, డీఈవో

# 'ఇందిరమ్మ' బిల్లు ఇక సులభం

- యాప్‌లో కొత్త ఆప్షన్
- నేరుగా లబ్దిదారులే ఎంట్రీ చేసే అవకాశం
- బిల్లుల ఆలస్యం, సిబ్బంది చేతివాటానికి చెక్

మెదక్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నివారించేందుకు, అవినీతిని ఆరికట్టేందుకు, వివరాల నమోదుకు యాప్‌లో కొత్త ఆప్షన్ అందుబాటులోకి తీసుకొచ్చింది. బిల్లుల ప్రతిపాదనలో జాప్యాన్ని నివారించేందుకు, ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం నేరుగా లబ్ధిదారులకే కల్పించింది. ఇళ్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు ఎవరైనా డబ్బులు కావాలని వేధింపులకు గురి చేస్తే ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 18005995991ను గృహ నిర్మాణశాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. మెదక్ జిల్లాకు 9,187 ఇళ్లు మంజూరు చేయగా.. 5,621 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. పునాది వరకు 2,692, గోడ స్థాయిలో 567, స్లాబ్ స్థాయిలో 300 ఉన్నాయి. నిర్మాణం పూర్తయిన ఇళ్లు 7 మాత్రమే. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల వివరాలు, ఇంతవరకు చేసిన చెల్లింపులు, తదితర సమాచారమంతా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. బిల్లు ప్రతిపాదన ఏ దశలో ఉంది? ఏ తేదీన.. ఎంత మొత్తం.. ఏ బ్యాంక్ ఖాతాలో జమ అయ్యింది.. అనే వివరాలు పారదర్శకంగా అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో లబ్దిదారులు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి అధికారులు, సిబ్బంది చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. పంచాతీయ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, మండల స్థాయిల్లో ఉద్దేశపూర్వక జాప్యం నివారణకు, అవినీతిని ఆరికట్టుడానికి ఇందిరమ్మ యాప్‌ను తీసుకొచ్చారు. బిల్లుల కోసం లబ్ధిదారులు స్వయంగా ఫొటోలు తీసుకొని అప్‌లోడ్ చేసే విధంగా యాప్‌ను అధునీకరించారు.



(ఫైల్)

### అప్‌లోడ్ చేయండి ఇలా..

మొదట మొబైల్ ఫోన్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత లబ్దిదారుడి లాగిన్‌లో ఫోన్ నెంబర్ ఎంట్రీ చేస్తే.. ఓటీపీ వస్తోంది. ఓటీపీ నమోదు చేసిన తర్వాత డ్యాష్ బోర్డులో లబ్దిదారుడి పేరు, ఫోన్ నంబర్ తదితర వివరాలతోపాటు ఫోటోలు తీయడం(క్యాప్చర్ ఫోటో గ్రాఫ్) అనే వాటి కింద ఇళ్ల నిర్మాణపు దశలె(గ్రౌండింగ్, బేస్‌మెంట్, వాలింగ్, స్లాబ్, నిర్మాణం పూర్తి) అని కనిపిస్తాయి. లబ్దిదారులు గ్రౌండింగ్ స్థాయి ఫోటోలు అప్‌లోడ్ చేయాలనుకుంటే గ్రౌండింగ్ క్లిక్ చేసే దరఖాస్తు దారుడికి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. లబ్దిదారులు ప్రతిపాదిత

మిగతా 8వ పేజీలో

## 'నారింజ'లో దూకేందుకు యత్నించిన తల్లీపిల్లలు

● పోలీసుల సహకారంతో క్షేమంగా ఇంటికి


నారింజలో దూకి ఆత్మహత్యకు పాల్పడేందుకు సిద్ధమైన తల్లీ, పిల్లల

జహీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భారాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో అవమానం భరించలేక పిల్లలతో సహా తల్లి నారింజ వాగులో దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి)వద్ద గల నారింజ ప్రాజెక్టువద్ద సోమవారం చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్‌ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. మండలంలోని బూడ్దిపాడ్‌కు చెందిన అమలాపురం నాగరాణి, భర్త సంతోష్‌రెడ్డిల మధ్య ఏర్పడిన మనస్పర్థలను భరించలేక నారింజప్రాజెక్టు వద్దకు ఆత్మహత్యకు పాల్పడేందుకు పిల్లలు దీపక్‌రెడ్డి, అక్షరలతో వచ్చింది. ఈ విషయాన్ని అక్కడ ఉన్న కొందరు పోలీసులకు సమాచారం హుటాహుటిన సిబ్బందితో నారింజప్రాజెక్టు వద్దకు వెళ్లి వారిని రక్షించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆత్మహత్య చేసుకోవడానికిగల కారణాలు తదితరాలను తెలుసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

# పేకాట స్థావరాలపై దాడి

● వివిధ ప్రాంతాల్లో 106 మంది అరెస్ట్

● సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం

జహీరాబాద్/చేగుంట/కల్హేర్/సిర్గాపూర్/రామచంద్రాపురం/కోహీర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ.. ఉమ్మడి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పేకాట స్థావరాలపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పేకాట ఆడుతున్న 106 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట, జూదం వంటి చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గ్రామాల్లో, ఫామ్‌హౌస్‌ల్లో, ఇళ్లల్లో, ఇతర ప్రాంతాల్లో పేకాట ఆడే వారిపై తమకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.

### జహీరాబాద్‌లో..

జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లి, చెన్నారెడ్డి నగర్, మానిక్‌ప్రభుమహేళా, పోచమ్మటెంపుల్, ఆర్యనగర్, అల్లీపూర్ తదితర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 55 మందిని అరెస్టు చేసి వారి వద్ద రూ.85వేల నగదు స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

### చేగుంటలో..

చేగుంట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద రూ.58వేల నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.


చేగుంటలో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్న టాస్క్ ఫోర్స్‌పోలీసులు

### కల్హేర్/సిర్గాపూర్‌లో..

కల్హేర్‌లో 8 మందిని, సిర్గాపూర్‌లో 10 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐలు నారాయణ, మహేష్‌లు తెలిపారు.

### రామచంద్రాపురంలో..

తెల్లాపూర్‌కు చెందిన దయాకర్‌రెడ్డి 'జీ' బ్లాక్‌లోని ప్లాట్ నంబరు 23, 24లలో అక్రమంగా నిర్మించిన ఫాం హౌస్‌లో సోమవారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను కొల్లూరు పోలీసులతో కలిసి ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్త దాడి నిర్వహించి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3.30లక్షలు, 6 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.


### కోహిర్‌లో..

మండలంలోని పైడిగుమ్మల్, సజ్జాపూర్, మనీయార్‌పల్లి గ్రామాలల్లో పేకాట ఆడుతున్న 18 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

## మంజీరాలో దూకి మహిళ ఆత్మహత్య


రేణమ్మ (ఫైల్)

పాపన్నపేట, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి) : ఇంట్లో భర్తతో గొడవ పడి ఇంట్లోంచి వెళ్లిపోయిన మహిళ మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఏడుపాయల్లో మంగళవారం వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.రామాయంపేట మండలం కోమట్ పల్లికి చెందిన రేణమ్మ (45) సోమవారం ఇంట్లో భర్తతో గొడవ పడి ఏడుపాయలకు వచ్చింది. మొదటి బ్రిడ్జి దగ్గర మంజీర నదిలో దూకింది. కుటుంబీకులు చుట్టూ పక్కల వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు.కాగా మంగళవారం సాయంత్రం నదిలో ఆమె మృత దేహాన్ని చూసిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు , వెంటనే వారు ఆమె భర్త మల్లేష్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఏడుపాయలకు వచ్చి మృతదేహాన్ని చూసి రేణమ్మదిగా గుర్తించారు. భర్త ఫిర్యాదు మేరకు శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.




## అస్తికలు కలిపేందుకు వచ్చి వ్యక్తి గల్లంతు

పుల్‌కల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మంజీర నదిలో అస్తికలు కలిపేందుకు వచ్చిన ఓ వ్యక్తి గల్లంతైన సంఘటన సింగూరు ప్రాజెక్టు వద్ద సోమవారం జరిగింది. పుల్కల్ ఎస్సై ఎన్.విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ గ్రామానికి చెందిన సూరజ్‌సింగ్ (52) బంధువు మృతి చెందడటంతో అస్తికలను మంజీర నదిలో కలిపేందుకు కుటుంబ సభ్యులతో కలిసి సింగూరు ప్రాజెక్టు వదకు వచ్చాడు. ప్రాజెక్టుకు ఎడమ వైపున గల జల విద్యుత్ కేంద్ర దిగువ భాగంలో అస్తికలు కలిపి అనంతరం స్నానం చేసేందుకని నదిలోకి దిగాడు. మంజీర జలాశయం బ్యాక్ వాటర్ విస్తరించడంతో నదిలో నీటి నిల్వలున్నాయి. నీటిలోకి దిగిన సూరజ్‌సింగ్ ఊపిరాడక మునిగి గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న సభ్యులంతా ఎంత అరుపులు, కేకలు వేసినప్పటికీ సూరజ్‌సింగ్ జాడ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై ఎన్.విశ్వజన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం స్థానిక మత్స్యకార్మికుల సహకారంతో తెప్పెలపై గాలింపు చర్యలు చేపడుతున్నారు. సూరజ్‌సింగ్ గల్లంతై రెండు రోజులు గడుస్తున్నప్పటికీ ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇద్దరు అదృశ్యం


కనిపించకుండా పోయిన విద్యార్థులు

నర్సాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు అన్నదమ్ములు మంగళవారం పాఠశాల నుంచి కనిపించకుండా పోయారు. ఎస్ఐ రంజిత్ కుమార్ కథనం ప్రకారం.. పాఠశాలలో మహ్మద్ అన్సార్ ఎనిమిదో తరగతి, మహ్మద్ నవాజ్ ఏడో తరగతి చదువుతున్నారు. వీరు మంగళవారం సాయంత్రం మైదానంలో ఆడుకునేందుకు వెళ్లారు. ఆ తర్వాత కనిపించకుండా పోయారు. విద్యార్థులు కనిపించడం లేదన్న సమాచారం అందుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అంతటా వెతికినా వారీ ఆచూకీ దొరకలేదు. దీంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నసీర్ షేక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య కుటుంబ తగాదాల నేపథ్యంలో తల్లి నర్సాపూర్‌లో, తండ్రి హైదరాబాద్‌లో ఉంటున్నట్లు సమాచారం.

## కల్వర్టు వద్ద ఊడిపోయిన డీసీఎం హౌసింగ్

● తృటిలో తప్పిన ప్రాణాపాయం


ఊడిపోయిన డీసీఎం వెనక టైర్లు

చేర్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామశివారు ప్రగతి విద్యానికేతన్ పాఠశాల సమీపంలోని మూలమలుపు కల్వర్టు వద్ద డీసీఎం వెనక భాగంలోని హౌసింగ్, టైర్లు ఊడిపడగా, తృటిలో ప్రాణాపాయం తప్పింది. సోమవారం ఉదయం జనగామ నుంచి చేర్యాలకు వస్తున్న ఓ డీసీఎం కల్వర్టు వద్ద గొయ్యి కారణంగా అదుపుతప్పి వెనక భాగంలోని టైర్ల బ్యానెట్ ఊడిపడగా, ముందరభాగం కొంతదూరం దూసుకెళ్లింది. డ్రైవర్ చాక చక్యత వహించి అదుపు చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటన సమయంలో చుట్టుపక్కల నుంచి వాహనాలేవీ రాకపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదు. గతంలో ఇదేప్రదేశంలో జరిగిన రోడ్డుప్రమాదంలో పలువురు మృతి చెందగా, మరికొందరు తీవ్రగాయాలపాలయ్యారు. అయినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తుండటం పట్ల ఎన్‌హెచ్ అధికారుల పట్టింపులేని తనంపై ఆగ్రహం వ్యక్తమవుతుంది. మరిన్ని ప్రమాదాలు జరగకముందే నిద్రమత్తువీడి కల్వర్టు వద్ద మరమ్మతులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

## అంత్యక్రియలకు వచ్చి.. అనంతలోకాలకు..

● మంజీరలో మునిగి ఇద్దరు మృతి

● కాపాడేందుకు వెళ్లి.. మరొకరు


శివయ్య (ఫైల్)

మెదక్ కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అంత్యక్రియల్లో పాల్గొన్న అనంతరం మంజీరా నదిలో స్నానం చేసేందుకు వెళ్లిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. తొలుత యువకుడు కాలుజారి నదిలో కొట్టుకుపోతుండగా, అతడిని కాపాడేందుకు వెళ్లి మరొకరు చనిపోయాడు. మెదక్ మండల పరిధిలోని పేరూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలు మెదక్ రూరల్ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకింద అంజమ్మ సోమవారం అనారోగ్యంతో చనిపోయారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం గ్రామంలోని మంజీరా ఒడ్డున వైకుంఠధామంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి అదే గ్రామానికి చింతకింది శ్రీకృష్ణ(16), చింతకింది శివయ్య(38)లు హాజరయ్యారు. అందరితో కలిసి స్నానం చేసేందుకు మంజీరా నదిలోకి దిగారు. చింతకింద శ్రీకృష్ణ కాలుజారి నదిలో మునిగిపోతుండగా, అది చూసిన చింతకింది శివయ్య అతడిని కాపాడేందుకు నదిలోకి వెళ్లాడు. నీటి ప్రవాహంలో ఇద్దరూ గల్లంతయ్యారు. పోలీసులు వచ్చి గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా, ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. చింతకింద శ్రీకృష్ణ పదో తరగతి చదువుతున్నాడు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం మెదక్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## దినసరి కూలీల ముందస్తు అరెస్ట్

శివ్వంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ జీతాల పెంపు కోసం గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పనిచేస్తున్న రోజు వారి కూలీలు మంగళవారం ప్రజా భవన్ ముట్టడికి వెళ్లకుండా శివ్వంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం డైలీ వారి కూలీ పెద్ద గౌనిస్వరూప, కోలా కిషన్,నరేష్ మాట్లాడుతూ గతంలో తమకు 13050 రూపాయలు ఉన్న నెల వేతనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 10400 వందలకు కుదించి సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పనిచేస్తున్న కూలీలను కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రగతి భవన్ ముట్టడికి వెళ్లనివ్వకుండా తమను ఉదయం 5 గంటలకు పోలీసు అరెస్టులు చేయడం బాధాకరమన్నారు. న్యాయమైన తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తమ ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం సంధించి తమను తమ జీతాలను పెంచి తమ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోలా కిషన్, పెద్దగౌని స్వరూప,దొడ్ల సువర్ణ, తంబాల జానకి,నరేష్, ఉన్నారు.







## కూలి పనులకు వచ్చిన వ్యక్తి అదృశ్యం


నర్సింలు (ఫైల్)

తూప్రాన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడి కూలీ పనులు చేసేందుకు వెళ్లిన వ్యక్తి కనిపించుకుండా పోయాడు. సిద్దిపేట జిల్లాకు చెందిన వ్యక్తి మెదక్ జిల్లాకు వచ్చి కనిపించకుండా పోయాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూరు గ్రామానికి మాసాన్‌పల్లి నర్సింలు (45), సరస్వతి దంపతులిద్దరు ఈనెల 12న రాత్రి కుటుంబ ఆర్థిక సమస్యలపై చిన్న గొడవ పడ్డారు. 13న ఉదయం నర్సింలు కూలీ పనులకంటూ ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఇంట్లోంచి కూలీ పనులకు వెళ్లిన నర్సింలు కనిపించకుండా పోయాడు. నర్సింలు కోసం వెతకగా 14న సాయంత్రం తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన హరిజన్ వెంకటేశ్ వద్దకు పనుల కోసం వెళ్లాడు. తరువాత నర్సింలును తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద దింపాలని అడగగా వెంకటేశ్ దింపినట్లు తెలిపారు. ఎంత వెతికనప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూప్రాన్ ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్సై శివానందం తెలిపారు.

## అక్కన్నపేట, కోమటిపల్లిలో..

● ఇరువురు మహిళల అదృశ్యం

● కుటుంబ కలహాలే కారణం


రేణవ్వ(ఫైల్)


రేణుక (ఫైల్)

రామయంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఇరువురు మహిళలు అదృశ్యమైన సంఘటనలు రామాయంపేట మండలంలో వెలుగు చూశాయి. కోమటిపల్లి గ్రామానికి చెందిన రేణవ్వ(45)దీపావళి పండగ రోజున ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ కలహాలతో భర్త మల్లేష్, రేణవ్వ ఇరువురు గొడవపడ్డారు. భర్త గొర్రెలు మేపేందుకు బయటకు వెళ్లి రాత్రి వచ్చేసరికి ఆమె కనిపించ లేదు. రేణవ్వ కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అలాగే మండల పరిధి అక్కన్నపేటకు చెందిన రేణుక(32) వరి చేను వద్దకు వెళ్లి అక్కడ నుంచి అదృశ్యమైంది. ఆదివారం పొలానికి వెళ్లిన ఆమె.. ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భర్త బుదయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై బాలరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

శివ్వంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కలిసి చదువుకుంటున్న విద్యార్థితో మాట్లాడుతుండగా గ్రామస్థులు చూడటంతో తల్లిదండ్రులకు చెబుతారనే భయంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. సంగారెడ్డి జిల్లా శివ్వంపేట మండలంలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు .. మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని తన పాఠశాలలోనే చదువుతున్న ఓ విద్యార్థితో మాట్లాడుతోంది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన కొందరు గమనించారు. వారు విషయాన్ని తన తల్లిదండ్రులకు చెబుతారేమోనని భయపడిన విద్యార్థిని ఆదివారం ఇంట్లోనే దూలానికి చున్నీతో ఉరి వేసుకుంది. గతంలోనూ ఇదే విద్యార్థితో ఆమె మాట్లాడుతుండగా, తల్లిదండ్రులు మందలించారని పోలీసులు తెలిపారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సాయిలు తెలిపారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి..


సుందర్ నాయక్(ఫైల్)

మాసాయిపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండలం తిమ్మాయిపల్లి రాజు తాండాకి చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు చేగుంట చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చెట్లకు తిమ్మాయిపల్లి రాజు తాండకు చెందిన కేతావత్ సుందర్ నాయక్ 38 శుక్రవారం రాత్రి తన ఇంటి వద్ద పురుగుల మందు త్రాగటంతో అతనిని కుటుంబీకులు చికిత్స కై గాంధీ ఆసుపత్రికి తరలించగా శనివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.

## అత్తారింట్లో అల్లుడు..

మెదక్, కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అత్తారింట్లో ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ మండలం పాతూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం - కామారెడ్డి జిల్లా రాజంపేటకు చెందిన కుమార్(38) పాతుర్‌కు చెందిన నిర్మలను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సొంత గ్రామాల్లో ఉపాధి లేకపోవడం గత రెండేళ్ల క్రితం భార్య పిల్లలతో కలిసి పాతూర్‌కు మకాం మార్చాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన కుమార్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మెదక్ రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

# కార్తీకం.. పరమ పవిత్రం

- నేటి నుంచి ప్రారంభం
- శివకేశవులకు ప్రీతికరమైన మాసం
- వ్రతాలు, నోములకు విశిష్టత
- ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు




కొండపాక/సిద్దిపేట కల్చరల్/ ఝరాసంగం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు నెలల్లో ఎంతో విశిష్టత, పవిత్రత కలిగిన కార్తీక మాసం నేటి (బుధవారం) నుంచి ప్రారంభం అవుతోంది. పూర్ణ చంద్రుడు కృత్తిక నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసానికి కార్తీక మాసం అనే పేరు వచ్చింది. దక్షిణాయణంలో ఈ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. కార్తీక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైనదిగా భావిస్తారు. ఈ మాసం అక్టోబరు 22 నుంచి నవంబరు 20 వరకు కొనసాగుతుంది.

### కార్తీకంలో ఆచారాలు, విశేషాలు

కార్తీక మాసంలో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. ప్రతి ఇంట్లో వ్రతాలు, నోములు ఎక్కువగా చేస్తారు. ముఖ్యంగా మహిళలు కార్తీక వ్రతాలు, దీపారాధనలు చేసి భక్తిని చాటుకుంటారు. వేకువజామున 4 గంటలకే నిద్రలేచి స్నానాలు ఆచరిస్తారు. ఈ మాసంలో నదీ స్నానాలు చేయడం విశేషం. నదిలో వేకువజామున విద్యుత్ శక్తి నిండి ఉంటుందని, ఆ సమయంలో స్నానం చేస్తే శరీరం ఉత్తేజం పొందుతుందని భక్తుల నమ్మకం.

### ఆలయాలకు కార్తీక శోభ

నెల రోజుల పాటు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుణ్యక్షేత్ర దర్శనాలు, దానధర్మాలు చేయడం వల్ల విశేష పుణ్యఫలం లభిస్తుందని పండితులు తెలిపారు.

### కేతకీ సంగమేశ్వర ఆలయంలో

ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయానికి కార్తీక మాసం సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. నవంబరు 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారి కల్యాణం, గంగహారతి, లక్షదీపారాధన కార్యక్రమాలను ఆలయ అధికారులు, పాలకవర్గం సభ్యులు వైభవంగా నిర్వహించనున్నారు.

### సిద్దిపేట పట్టణంలో..

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ ఉమాపార్థివ కోటి లింగేశ్వరాలయంలో బుధవారం సాయంత్రం ఆకాశదీపంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఈ నెల రోజులు విశేష పూజలుంటాయి. నవంబరు 1 న నాగుల చవితి, 2 న తులసి కల్యాణం, 5 న కార్తీక పౌర్ణమి, 8న సంకష్టహర చతుర్థి, 9న ఆరుద్ర నక్షత్రం, 14 న ఉమామహేశ్వర సహిత శ్రీ అష్టోత్తర శతలింగేశ్వర దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా ఉసిరి చెట్ల కింద బోజనం నిర్వహిస్తారు. 15న మదనానంద సరస్వతి ఆరాదన, 17న నందీశ్వర అభిషేకంతోపాటు ప్రతి సోమవారం విశేష అభిషేకాలు, శివపార్వతుల పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పారునంది మహేష్ శర్మ తెలిపారు. శ్రీ శరభేశ్వరాలయంలో కూడా సామూహిక అభిషేకాలు, దీపారాధనలు నిర్వహించనున్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణ అధికారి రవికుమార్ తెలిపారు.


కేతకీలో కొలువుదీరిన పార్వతీపరమేశ్వరులు



### దీపారాధన, శివారాధన

కార్తీక మాసంలో దీపారాధన చేయడం మహామహిమోపేతమైనదిగా భావిస్తారు. శివాలయంలోగాని, ఇంట్లోనైనాసరే ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం దైవానుగ్రహం లభిస్తుంది. ఇక శివారాధన చేస్తే విశేష పుణ్యఫలం లభిస్తుందని కార్తీక పురాణం చెబుతోంది. ముఖ్యంగా కార్తీక మాసం సోమవారాల్లో సూర్యోదయంకు ముందుగా స్నానం చేసి, శివాలయ దర్శనం చేసుకుని రుద్రాభిషేకం చేసి ఉపవాస దీక్ష పాటిస్తే అశ్వమేధ యాగం చేసిన ఫలితం లభిస్తుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు.

### తులసి, ధాత్రీ (ఉసిరి) పూజ

ఈ మాసంలో తులసి పూజలను దైవ స్వరూపంగా భావిస్తారు. అలాగే ఉసిరికాయ లక్ష్మీదేవికి ఎంతో ఇష్టమైనది. ఉసిరి చెట్టు కింద సత్యనారాయణ స్వామి వ్రతాలు చేయడం, బంధుమిత్రులతో కలిసి భోజనాలు చేయడం (వనభోజనాలు) ఎంతో అదృష్టాన్నిస్తుందని నమ్మకం. కేదారేశ్వర గౌరీ నోము, లక్ష్మీపత్రిపూజ, క్షీరాబ్ది ద్వాదశ వ్రతం, సత్యనారాయణ నోము వంటివి చేసుకుంటే విశేష ఫలితాలు కలుగుతాయని విశ్వాసం. ఈ మాసంలోనే అయ్యప్పస్వామి మాలధారణ ప్రారంభమవుతుంది.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాపన్నపేట విద్యార్థి ప్రతిభ


విద్యార్థి నరసింహులును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాపన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-14 కబడ్డీ పోటీల్లో మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థి సత్తా చాటాడు. ఈ నెల 16 నుంచి 18 వరకు పటాన్‌చెరులో నిర్వహించిన పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టులో పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్. నరసింహులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా నరసింహులును పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్‌తో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విద్యార్థి విజయం కోసం కృషి చేసిన పీడీ రమేశ్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు.

# రాష్ట్ర స్థాయి గో విజ్ఞాన పరీక్షలకు అల్లాదుర్గం విద్యార్థినులు



హేమలత, సౌమ్య

అల్లాదుర్గం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత సేవా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గో విజ్ఞాన సేవా సమితి పోటీ పరీక్షల్లో అల్లాదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్ సత్తయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 17 న మెదక్ పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి పరీక్షల్లో కళాశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వారిలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి. హేమలత, సౌమ్య ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 26 న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పరీక్షలకు వారు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

# పిట్టల వాడ.. వసతుల జాడెక్కడ?


టర్పాలిన్‌తో ఏర్పాటు చేసిన గూడు వద్ద నివాసితులు

- 70 ఏళ్లుగా రోడ్డు, పక్కా ఇళ్లకు నోచుకోని పేదలు
- దారి లేక పంట పొలాల మీదుగా రాకపోకలు
- దుర్భరమైన జీవనం గడుపుతున్న కుటుంబాలు
- విద్య, వైద్య సేవలకు చిన్నారులు దూరం

శివ్వంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు, పాలకులు ప్రకటనలు గుప్పిస్తున్నా, ఆచరణలో మాత్రం అవి పేదలకు అందడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా, పేదల తలరాతలు మాత్రం మారడం లేదు. దీనితో పేదలు కనీస వసతులు కూడా నోచుకోక, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన జీవనం గడుపుతూ కాలం వెళ్లదీస్తున్నారు.

### 70 ఏళ్లుగా..

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం, ప్రముఖ పుణ్యక్షేత్రం సికింద్లాపూర్‌కు అతి సమీపంలో ఉన్న పిట్టల వాడ ప్రజలు నేటికీ కనీస వసతులకు దూరంగా, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. ఇక్కడ సుమారు 70 ఏళ్లగా నివాసం ఉంటున్న ఐదు కుటుంబాలకు చెందిన దాదాపు 30 మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు.

### దారి లేక తీవ్ర ఇక్కట్లు

నేటికీ ఈ వాడకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. దీంతో ఇతరుల పంట పొలాల మీదుగా వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. రోడ్డు మార్గం లేకపోవడం వల్ల అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందడం లేదని, పిల్లలు విద్యకు దూరమవుతున్నారని స్థానికులు వాపోయారు. ఇతరుల పొలాల నుంచి వెళ్లనీయకపోవడంతో తమ ఇళ్లకు వెళ్లడానికి దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్ రావడానికి కూడా రోడ్డు మార్గం లేకపోవడంతో సాగు పనులు కష్టంగా మారాయని తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా పక్కా గృహాలు లేకపోవడంతో, టార్పాలిన్‌లతో ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లోనే బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి తమ కుటుంబాలకు రోడ్డు మార్గం ఏర్పాటు చేయడంతోపాటు సకల వసతులు కల్పించాలని వారు వేడుకుంటున్నారు.


పంట పొలాల గుండా పిట్టల వాడకు వస్తున్న స్థానికులు

# జైళ్లలో డీ-అడిక్షన్ సెంటర్లు

- జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా
- సంగారెడ్డి సెంట్రల్ జైలులో ప్రారంభం


డీ-అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీజీ సౌమ్య మిశ్రా

కంది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డీ-అడిక్షన్ సెంటర్‌లతో ఖైదీల జీవితాల్లో మార్పు వస్తుందని, మత్తుకు బానిసైన ఖైదీలలో మార్పు తీసుకువచ్చేందుకు జైళ్లలో డీ-అడిక్షన్ సెంటర్లను ప్రారంభిస్తున్నామని జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా అన్నారు. కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులో మంగళవారం ఆమె జైళ్లశాఖ ఐజీ మురళీబాబు, డీఐజీ శ్రీనివాస్‌లతో కలిసి డీ-అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌమ్య మిశ్రా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం దేశంలో అతిపెద్ద సమస్యగా మారిందన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అంతేగాక మత్తుకు బానిసై నేరాలోచనలు చేస్తూ తమ భవిశ్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారి పేర్కొన్నారు. జైళ్లలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్‌లలో ఖైదీల్లో మత్తు వ్యసనాన్ని వదిలించడమే కాకుండా, మళ్లీ వారు ఎలాంటి మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జైలు ఆవరణలోని వ్యవసాయక్షేత్రంలో సౌమ్యమిశ్రా తేనే ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జైలు పర్యావేక్షణ అధికారి టి.కళాసాగర్, డిప్యూటీ సూపరింటెండెంట్ భరత్‌రెడ్డి, జైలర్ సత్యం, జైళ్లశాఖ వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ముగిసిన 'అస్త్ర-25'



ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నర్సాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో 'అస్త్ర-25' పేరిట నిర్వహించిన ఇంజనీరింగ్ ప్రతిభ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీలలో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల కళాశాలల విద్యార్థులు కూడా పాల్గొని ప్రతిభ చాటారు. చివరి రోజు నిర్వహించిన ఫైనల్ పోటీలకు ముంబైకి చెందిన ఐసీటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎ.బి. పండిట్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, సౌరశక్తి, వాయు శక్తి వంటి పునరుత్పాదక శక్తులను వినియోగించి శక్తిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఫైనల్ సందర్భంగా విద్యార్థులు తీర్చిదిద్దిన 'రియాక్ట్ ఓ కార్' పోటీ నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీవీఆర్ఐటీ చైర్మన్ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్, అపిటోరియా ఫార్మా అధ్యక్షులు రవినాథ్‌శెట్టి, వీఎన్ఐటీ నాగపూర్ ప్రొఫెసర్ శ్రీరామ్, నర్సాపూర్ బీవీఆర్ఐటీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, మేనేజర్ బాపిరాజు, ఏవో సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో యువకుడి హల్‌చల్

- మద్యం మత్తులో విద్యుత్ స్థంభంపైకి ఎక్కిన వైనం


విద్యుత్ స్థంభం ఎక్కిన యువకుడు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ యువకుడు 33 కేవీ విద్యుత్ స్థంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటకు చెందిన వెంకన్న అలియాస్ వినోద్ (32) మద్యం మత్తులో పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం లోపల ఉన్న 33 కేవీ విద్యుత్ స్థంభం ఎక్కాడు. తనకు ఉద్యోగం కల్పించాలని, ఈ విషయంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హామీ ఇస్తేనే తాను కిందకు దిగుతానని, లేకుంటే కిందకు దూకుతానని, విద్యుత్ వైర్లను పట్టుకుంటానని బెదిరించాడు. స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ విషయం తెలుసుకున్న సంగారెడ్డి పట్టణ సీఐ రమేష్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉద్యోగం విషయంలో న్యాయం చేస్తామని, వెంటనే కిందకు దిగాలని సదరు యువకుడు వెంకన్నతో సీఐ ఫోన్‌లో మాట్లాడి ఒప్పించడంతో అతను కిందకు దిగాడు. దాదాపు గంటల పాటు ట్రాన్స్‌కో ప్రాంతంలో హైడ్రామా నెలకొన్నది.

# ఆధునిక సాగు.. లాభాలు బాగు

- శాశ్వత పందిళ్లు, మల్చింగ్, బిందు సేద్యం విధానంలో పంటల సాగు
- వాణిజ్య పంటలను వదిలి.. కూరగాయలు పండిస్తున్న రైతులు
- పందిళ్లు, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం
- సబ్సిడీపై పరికరాలు అందజేత


అక్కన్నపేట మండలం జనగామలో పందిళ్ల పద్ధతిలో సాగుచేసిన కాకరకాయ


పందిరి పద్ధతిలో సాగుచేసిన బీరకాయ

అక్కన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న సాగు చేసి దిగుబడులు లేక నష్టపోతున్న రైతులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకుంటున్నారు. లక్షల పెట్టుబడులు పెట్టి నష్టపోవడం కంటే, రోజువారీ ఆదాయం లభించే కూరగాయల సాగు వైపు మొగ్గు చూపిస్తున్నారు. అతి వృష్టి, అనావృష్టి, తెగుళ్లు, చీడపీడల వంటి ప్రతికూల పరిస్థితులతో వాణిజ్య పంటలు నష్టాలు తెస్తుండగా, కూరగాయల సాగు మాత్రం లాభాలు పండిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

### వంద ఎకరాల్లో కూరగాయల సాగు

అక్కన్నపేట మండలంలోని జనగామ, అంతకపేట, మంచినీళ్లబండ, కుందనవానిపల్లి, గండిపల్లి, ధర్మారం, తురకవానికుంట గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. ఆధునిక పద్ధతులైన శాశ్వత పందిళ్లు, మల్చింగ్ విధానం, డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) ఉపయోగించి, తక్కువ పెట్టుబడితో సేంద్రీయ పద్ధతిలో ఎక్కువ కూరగాయలు పండించి లాభాలు ఆర్జిస్తున్నారు. బీర, చిక్కుడు, కాకర, వంగ, బెండ, టమాట, దోస, సొరకాయ, పచ్చిమిర్చి, అనపకాయ, అలసంద, గోరుచిక్కుడు వంటి కూరగాయలతో పాటు తోటకూర, పాలకూర, చుక్కకూర లాంటి ఆకుకూరలను సాగు చేస్తున్నారు. ఆరోగ్యరీత్యా సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన ఈ కూరగాయలకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. సీజన్ ఏదైనా ఏడాదంతా వీటికి మంచి ధర లభిస్తోంది. వాణిజ్య పంటలతో పోలిస్తే, కూరగాయలకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, పెట్టుబడి కూడా తక్కువగానే ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

### రైతులకు రోజువారీ ఆదాయం

వాణిజ్య పంటలకు ఒకసారి మాత్రమే ఆదాయం వస్తుంది, దానికి కూడా రైతులు ఆరు నెలలు ఎదురు చూడాలి. కానీ, కూరగాయల సాగుతో రైతులకు రోజువారీ ఆదాయం వస్తుంది. ఒక పంట చేతికొచ్చి ఎండిపోయేలోపు మరో పంట కాపుకొచ్చేలా రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కోసిన కూరగాయలను ఏరోజుకారోజు తాజాగా హుస్నాబాద్, సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ పట్టణ మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. కూరగాయల సాగుతో రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా, కూలీలకు ఉపాధి కూడా లభిస్తోంది.

### రాయితీలతో ప్రభుత్వ ప్రోత్సాహం..

కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. శాశ్వత పందిళ్లు, మల్చింగ్, బిందుసేద్యానికి భారీగా సబ్సిడీ అందిస్తున్నది. డ్రిప్ ఇరిగేషన్ కోసం ఎస్సీ ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ, బీసీలకు, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ లభిస్తుంది. స్ప్రింక్లర్లు ఏ రైతుకైనా 70 శాతం సబ్సిడీ వస్తుంది. బిందు సేద్యం ఉన్న రైతులకు మల్చింగ్ కోసం ఎకరానికి 50 శాతం చొప్పున ఒక్కో రైతుకు రెండు ఎకరాల వరకు రాయితీ ఇస్తున్నది. శాశ్వత పందిళ్ల కోసం అన్ని కేటగిరీల రైతులకు ఎకరానికి రూ.లక్ష సబ్సిడీ సౌకర్యం ఉంది. చాలా మంది రైతులకు ఈ సబ్సిడీపై అవగాహన లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. అధికారులు స్పందించి అవగాహన కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### మల్చింగ్ పద్ధతిలో పండిస్తున్నా..



పత్తి, వరి పంటలతో చాలా నష్టపోయాను. 20 గుంటల్లో కాకర, బీర, చిక్కుడుకాయ మల్చింగ్ పద్ధతిలో శాశ్వత పందిరి ద్వారా సాగు చేస్తున్నాను. సొంత ఖర్చుతో సాగు చేస్తున్న నాకు ప్రభుత్వ సబ్సిడీలపై తెలియదు. అధికారులు అవగాహన కల్పించాలి.

– బొజ్జపూరి వేణు, రైతు, జనగామ, అక్కన్నపేట మండలం

### అధికారుల సూచనలు పాటించాలి..



కూరగాయల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. ఆధునిక పద్ధతిలో సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కూరగాయలు పండించే రైతులు అధికారులను సంప్రదించి, సలహాలు, సూచనల మేరకు పంటలను సాగు చేసి అధిక లాభాలు పొందాలి.

– బాలాజీ, హార్టికల్చర్ అధికారి



జహీరాబాద్‌లోని అతిథి-ఇన్ వద్ద పటాకులు కాలుస్తూ సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, తదితరులు



ఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్ష్మీపూజ నిర్వహిస్తున్న సంజీవరెడ్డి దంపతులు



మెదక్ జిల్లా కేంద్రంలో కాకరపూవ్వొత్తులు, టపాసులు కాలుస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్ తదితరులు

# భక్తిశ్రద్ధలతో దీపావళి

దీపావళి వేడుకలను మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో జరుపుకున్నారు. వ్యాపార సంస్థలు, గృహాలు, కార్యాలయాల్లో లక్ష్మీదేవిని అందంగా అలంకరించి పూజలు చేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా టపాసులు కాల్చి ఆనందంగా గడిపారు.

- న్యూస్ నెట్‌వర్క్



కౌడిపల్లిలో దీపావళి సందర్భంగా లక్ష్మీదేవి పూజల అనంతరం టపాసులు కాల్చుతున్న దృశ్యం



చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో స్వయం భూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త గోల్కొండ కిషన్‌రావు



మనోహరాబాద్ : ధర్మరాజుపల్లి గ్రామంలో కుటుంబంతో కలిసి టపాసులు కాల్చుతున్న ఫ్యాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణరెడ్డి



మునిపల్లి : దీపావళి సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ కుటుంబసభ్యులు



అనాథ చిన్నారులకు టపాసులు పంపిణీ చేస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్

## న్యూస్ బాక్స్

### ప్రజలకు సేవలు అందించాలి

పాపన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. మంగళవారం పాపన్నపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. మండలంలో కొత్తగా విధుల్లో చేరిన 10 మంది జీపీవోలకు విధుల గురించి వివరించారు.

### 'ప్రజాబాట'తో సమస్యలు పరిష్కారం

కౌడిపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాబాట కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌బాబు అన్నారు. మంగళవారం కౌడిపల్లిలోని నియంత్రికల వద్ద ఉన్న చెట్ల పొదలను తొలగించి, మాట్లాడారు. మంగళ, గురు, శనివారాల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

### ఎన్నికల్లో సత్తా చాటుతాం

పుల్‌కల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామని ఆ పార్టీ యువ నాయకురాలు చంటి దేవికప్రభ అన్నారు. చౌటకూర్ మండలం గంగోజిపేట గ్రామంలో మంగళవారం పాదయాత్ర చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహనికి పూల మాలవేసి నివాళులర్పించి, బీజేపీ జెండాను ఆవిష్కరించారు.

### ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

నారాయణఖేడ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకానికి సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎంఐఎం ఖేడ్ అధ్యక్షుడు, న్యాయవాది మోహీద్‌పటేల్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పథకం కింద చదువుతుండగా మూడేళ్ల నుంచి ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో రూ.200 కోట్లు పేరుకుపోయాయని తెలిపారు.

### ఇళ్ల పనులు పరిశీలన

పెద్దశంకరంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని వీరోజిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో షాకీర్‌అలీ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో మొత్తం 20 ఇండ్లు మంజూరు కాగా, అందులో 13 ఇండ్లు నిర్మాణ దశలో ఉండగా.. 13 మంది లబ్ధిదారులకు మొదటి విడత బిల్లు చెల్లించామని వివరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సిద్ధు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### బోనస్ డబ్బులు ఎప్పుడిస్తారు..?

చిన్నశంకరంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో కొనుగోలు చేసిన సన్నరకం వరి ధాన్యం బోనస్ రూ.500 ఇంకెప్పుడు ఇస్తారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు యాదారావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వడ్లకు బోనస్ డబ్బులు నేటికీ ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయి

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందిసాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కంది మండలం ఇంద్రకరణ్‌లో దీపావళి సందర్భంగా నిర్వహించిన అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం సాయంత్రం ముగిసింది. మొదటిస్థానంలో నిలిచిన ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన గేమ్ చేంజర్ టీంకు రూ.33 వేల నగదుతో ట్రోఫీ, రన్నర్ ఎగా నిలిచిన ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన అంబేడ్కర్ టీంకు రూ.22 వేల నగదుతో పాటు ట్రోఫీని ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి, చింతా సాయినాథ్, నారాయణ, వెంకటేష్, శ్రీనివాస్ మహిపాల్, ఎస్. వెంకటేష్, మల్లేశం పాల్గొన్నారు.




విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

రేగోడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రవేత్తలు పరిశీలించి అందిస్తున్న విత్తనాలతో అధిక దిగబడులు పొందచ్చని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ రైతులకు సూచించారు. మంగళవారం రేగోడు రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత, నూనె గింజల పథకం కింద మంజూరైన రాయితీ శనగల, సన్‌ఫ్లవర్ విత్తనాలను కలెక్టర్ రైతులకు అందజేసి మాట్లాడారు. పంట ఉత్పత్తులను బట్టి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారని, ధాన్యం సేకరించుటకు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. అకాల వర్షాల కారణంగా జిల్లాలోని టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడు, పెద్ద శంకరంపేట మండలాల్లో పత్తి పంట పాడైనట్లు క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుతో సర్వేచేసి ప్రభుత్వానికి అందించామని చెప్పారు. నష్టపోయిన రైతులకు పరిహారం రానున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఏడీఏ టెక్నికల్ వినయ్ విన్సెంట్, పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్, ఏవో టెక్నికల్ హర్ష, వందన, రైతులు పాల్గొన్నారు. పశు వైద్యశాలలో ఉత్తమ సేవలు అందాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం రేగోడు పశు వైద్యాకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.



రేగోడు రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

### పేదలకు మెరుగైన వైద్యం

పాపన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పేదలకు మెరుగైన వైద్యమందుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేట మండలంలోని పొడిచిన పల్లిలోని ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం పర్యవేక్షించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు, యంత్రాలు ఉన్నాయని తెలిపారు.

## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

కౌడిపల్లి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 21: గ్రామపాలన అధికారులు తప్పనిసరిగా ప్రజలు అందుబాటులో ఉండాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో భూభారతి ద్వారా 37 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 24 వేల దరఖాస్తులను పరిష్కరించామన్నారు. గతంలో సమస్యలు ఉన్న అసైన్డ్ భూముల దరఖాస్తుల వివరాలు తెలుసుకునేందుకు గ్రామాలకు వెళ్లి విచారణ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఆర్ఐ శ్రీహరి, సర్వేయర్, మొగులయ్య ఉన్నారు.

## పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నారాయణఖేడ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం అభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురికి వైద్యశాల ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాల చెక్కులను మంగళవారం అందజేసి మాట్లాడారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోజిరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు ఆవుటి శంకర్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఖేడ్ ఆర్టీసీ డీఎంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుబ్రహ్మణ్యం ఎమ్మెల్యే సంజీవరెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## గ్రామపంచాయతీ కార్యాలయంలో డీఎల్పీవో తనిఖీ



పెద్దశంకరంపేట గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్పీవో సురేష్‌బాబు

పెద్దశంకరంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం మెదక్ డివిజన్ డీఎల్పీవో సురేష్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పలు సమస్యలపై విచారణ చేపట్టి సంబంధిత జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. అనంతరం మండల పరిధిలోని కట్టెల వెంకటాపూర్ గ్రామపంచాయతీని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో జాకీర్‌హుస్సేన్, ఈవో వెంకటరాములు ఉన్నారు.

## ప్రీ ప్రైమరీలో ప్రవేశాలకు చర్యలు

● సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రీ ప్రైమరీలో విద్యార్థుల ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా డీఈవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ తరగతి గదిని పరిశీలించారు. ప్రభుత్వం ప్రారంభించిన ప్రీ ప్రైమరీ తరగతుల్లో వచ్చిన ఫర్నిచర్, వసతులను పరిశీలించారు. అనంతరం ప్రాంగణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విద్యాసాగర్ పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ' బిల్లు ఇక సులభం

(5వ పేజీ తరువాయి)

ఇంటి నిర్మాణ స్థలం నుంచే ఫోన్‌లోని కెమెరాలతో ఫోటోలు తీయాలి. ఇక్కడే కెమెరాలో జియో ట్యాగింగ్ నిమిత్తం మ్యాప్ సింబల్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి, ఒకసారి చెక్ చేసుకున్న తర్వాత సబ్‌మిట్ చేయాలి. ఆ తర్వాత వెనక్కి వెళ్లి గ్రౌండింగ్ బటన్‌ను క్లిక్ చేస్తే వివరాలన్నీ కనిపిస్తాయి.

బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణ పనులు జరుగుతున్న ఇంటి వద్ద లబ్ధిదారుడితోపాటు ముందు వైపు నుంచి, పక్క నుంచి, పై నుంచి( టాప్ యాంగిల్) ఫోటోలు తీయాలి. ఈ ఫోటోలు గ్రౌండింగ్ సమయంలో తీసిన ప్రాంతం సమీపం నుంచే తీయాలి. యాప్ అడిగిన సమాచారాన్ని నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. ఇదే తరహాలో వాలింగ్ దశలోనూ, స్లాబ్ దశలోనూ ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వా ఫోటోలు తీసి లబ్దిదారులే నేరుగా బిల్లుల కోసం అప్‌లోడ్ చేయొచ్చు. గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవోలు, డీఈఈలు, పీడీ, తదితర అధికారులు ఈ విధంగా నమోదైన వివారానలు క్షేత్రస్థాయిలో సరి చూసుకున్న తర్వాతనే లబ్దిదారులకు బిల్లులు విడుదల చేస్తారు. ఈ అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ పీడీ మాణిక్యం సూచించారు.

### జహీరాబాద్‌లో మోస్తరు వర్షం

జహీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రివకు మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి అడపాదడపా జల్లులు కురిసి సాయంత్రం పెద్దమొత్తంలో కురిసింది.

## నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి



తూప్రాన్‌లో దివంగత డీఎస్పీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నరేందర్‌గౌడ్



జహీరాబాద్ పట్టణంలో ర్యాలీ ప్రారంభిస్తున్న పోలీసులు

తూప్రాన్/జహీరాబాద్/పాపన్నపేట/కల్హేర్, సిర్గాపూర్/వెల్దుర్తి/ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నేర రహిత సమాజం నిర్మాణం కోసం పోలీసు శాఖ కృషి చేస్తుందని తూప్రాన్ డీఎస్పీ జే.నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా పిల్లుట్ల మందుపాతరకు బలైన దివంగత డీఎస్పీ అవ్వారు బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. డీఎస్పీతోపాటు ఎస్‌ఐలు సుభాష్‌గౌడ్, రాజు, యాదగిరి, జ్యోతి, ప్రజలు నివాళులర్పించారు. విధుల నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను అందరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్, పట్టణ సీఐ శివలింగంలు పేర్కొన్నారు. పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో పోలీసులు, తదితరులు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. పాపన్నపేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన అమరవీరుల స్తూపం వద్ద ఎస్‌ఐ, పోలీసులు నివాళులర్పించారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో మంగళవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి గ్రామ పుర వీధుల గుండా శివాజీ చౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహేష్, ఎంఈవో నాగారం శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రాజు ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు.

## లక్ష దీపోత్సవానికి భారీ ఏర్పాట్లు

నారాయణఖేడ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : లలితా వైభవం తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27, 28 తేదీల్లో నారాయణఖేడ్‌లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు మలమంచి మోహన్ జ్యోషి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న తహసీల్ మైదానంలో కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకొని లక్ష దీపోత్సవంతో పాటు ఈనెల 28న మంగల్‌పేట దుర్గా మాత ఆలయం, మా ఫంక్షన్‌హాల్ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణం, అష్టలక్ష్మి, మహా సుదర్శన యాగం, రమాసహిత సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి పాల్గొంటారన్నారు.

## వాలీబాల్ విజేత ముద్దాయిపేట జట్టు



వాలీబాల్ క్రీడాకారులకు మెమోంటో అందజేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్

పుల్‌కల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పుల్కల్ మండలస్థాయిలో ముద్దాయిపేట గ్రామంలో యంగర్స్ యువజన సంఘం అధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ క్రీడలు మంగళవారం ముగిసాయి. ఈ క్రీడా పోటీల్లో మొత్తం 12 జట్లు పాల్గొనగా, ఫైనల్ పోటీల్లో ముద్దాయిపేట జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో వెంకటకిష్టాపూర్‌పై గెలిచింది. విజేతగా నిలిచిన ముద్దాయిపేట జట్టును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మాచర్ల విజయ్‌కుమార్ అభినందించారు. అనంతరం నగదుతో పాటు మెమొంటోను ప్రదానం చేశారరు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు పెద్దగొల్ల దత్తాత్రేయ, దుర్గేష్, మల్లేశం, బిక్షపతి, వీరేశం, నరహరి, విశ్వనాథం, అంజయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఫ్రీ ఇసుక టోకెన్ల పంపిణీ



రుక్మాపూర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఫ్రీ ఇసుక టోకన్స్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో చిన్నారెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ పరమేష్

చేగుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎంపీడీవో చిన్నారెడ్డి, రెడ్డిపల్లి ఫ్యాక్స్ చైర్మన్ మేకల పరమేష్ మంగళవారం ఫ్రీ ఇసుక టోకన్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రుక్మాపురంలోని 18 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వారికి ఫ్రీ ఇసుక టోకెన్లు అందజేసినట్లు తెలిపారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి

జహీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రంజోల్ గ్రామంలో గల రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు వివిధ రకాల సబ్సిడీలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే రైతులకు శనగలు, కుసుమ, వేరుశనగ తదితర విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి, ఏఈవో ప్రదీప్, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## పీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : బీజేపీ



శాలిపేటలో బాధిత కుటుంబానికి పీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పేదలకు వరమని బీజేపీ మండలాధ్యక్షుడు రాజు అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన ముంద్రాతి అనసూయ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. వైద్య ఖర్చుల నిమిత్తం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో పీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి దశరథం, ఉపాధ్యక్షుడు మేడి శ్రీనివాస్, నర్ర ఎల్లం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవల్ ఇన్‌చార్జిల సమావేశంలో బీఆర్ఎస్ శ్రేణులు




జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార సమీక్షలో కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పటాన్‌చెరు డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి బూత్ లెవల్ నాయకుల సమీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సందీప్‌గిరిగోస్వామి, ఐలాపూర్ మాణిక్‌యాదవ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

## అపోలో ట్యూబ్స్ ఉద్యోగుల బదిలీలు ఆపాలి

చేగుంట , అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం వడియారం గ్రామంలోని అపోలో ట్యూబ్స్ పరిశ్రమ ఉద్యోగుల బదిలీలను ఆపాలని ఉద్యోగులు కోరారు. ఈ విషయమై మంగళవారం హైదరాబాద్‌లో కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ మాట్లాడతూ 15 ఏళ్లుగా పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులను దూర ప్రాంతాలకు బదిలీలు చేస్తున్నారని, వెంటనే వాటిని ఆపాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం కృషి చేస్తానని హామీఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట బీఎంఎస్ నాయకులు, కుంట రాజు, కుమార్, నవీన్‌యాదవ్, శ్రీనివాస్, సునీల్ పాస్వన్ పాల్గొన్నారు.